క్లుప్తంగా

నాగలాపురం చేరిన శ్రీవారి గొడుగులు



ఊరేగింపుగా వస్తున్న శ్రీవారి గొడుగులు

నాగలాపురం: శ్రీవారికి గరుడసేవలో సమర్పించే శ్రీవారి గొడుగులు బుధవారం మధ్యాహ్నం నాగలాపురానికి చేరుకున్నాయి. తమిళనాడు రాజధాని చెన్నై తిరునిండ్రయూర్‌లో శ్రీమద్ రామానుజ నిత్య కైంకర్యం ట్రస్టు వారు ఏటా శ్రీవారి గరుడ సేవకు గొడుగులు సమర్పించడం ఆనవాయితీ. ఇక్కడి నుంచి గొడుగులను తిరుమలకు ఊరేగింపుగా తీసుకెళ్తామని నిర్వాహకులు తెలిపారు. ఊరేగింపుగా వచ్చిన శ్రీవారి గొడుగులను ప్రజలు దర్శించుకున్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఏలూరుకు చెందిన కేవీ సూర్యప్రకాష్‌రావు, కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా దక్షిణ కైలాసగిరిలో ఉన్న హరహర తీర్థంలోని ఆలయ పునర్నిర్మాణ పనులను బుధవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హరహర తీర్థంలో స్వామివారి ఆలయంతోపాటు అమ్మవారి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసే విధంగా పాలకమండలి సమావేశంలో తీర్మానం చేశామన్నారు. సుమారు రూ.40 లక్షలతో పునర్నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలో పునర్నిర్మాణ పనులు చేసి మహాకుంభాభిషేకం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

నగరి: సత్యసాయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర సత్యసాయి సేవాసంస్థల విద్యా విభాగం పిలుపు మేరకు శ్రీ సత్యసాయి విద్యా విధానం విశిష్టతను తెలియజేస్తూ ప్రాంతీయ, జిల్లా, రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీలోపు చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లోని విద్యార్థులకు ప్రత్యేక వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు 'ఆచార్య దేవోభవ' అనే అంశంమీద, జూనియర్ కళాశాల్లో విద్యా ర్థులకు 'ప్రకృతియే ఉత్తమ గురువు' అనే అంశంమీద, డిగ్రీ కళాశాల విద్యార్థులకు ×మానవత్వం పెంపొందించే విద్యా ఆవశ్యకత× అనే అంశం మీద తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. ప్రాంతీయ స్థాయి పోటీల ఫలితాలు అక్టోబర్ 15వ తేదీన, జిల్లాస్థాయి ఫలితాలు అక్టోబర్ 25వ తేదీన, రాష్ట్రస్థాయి ఫలితాలను నవంబరు 5వ తేదీన ప్రకటిస్తామన్నారు. వీటికి సంబంధించిన కరపత్రాలను డీఈఓ విడుదల చేశారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మకం

నగరి : లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడంపై మంత్రి ఆర్కే రోజా బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె బిల్లు ప్రవేశపెట్టడానికి చొరవ తీసుకున్న ప్రధాని నరేంద్రమోదీకి, తొలి నుంచి అందుకు మద్దతుగా నిలిచిన సీఎం జగనన్నకు, ఓటింగ్‌లో మద్దతుగా నిలిచిన ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా బిల్లు రాకముందే మహిళలకు 50 శాతం పదవులు, నామినేటెడ్ పోస్టులు ఇచ్చి గౌరవించడం ద్వారా దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా జగనన్న నిలిచిపోయారని ఆమె కొనియాడారు. 454 ఓట్లతో ఈ బిల్లు ఆమోదం పొందడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఒక మహిళగా, మహిళా మంత్రిగా తాను గర్వపడుతున్నానని తెలిపారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన 75 ఏళ్ల తరువాత మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించడం మహిళలకు దక్కిన విజయం అన్నారు.



వినాయక నిమజ్జనంలో యువత



ఎర్రమిట్ట గ్రామంలో వినాయక స్వామి ఊరేగింపు



బీఎన్‌కండ్రిగలో ఉట్టి కొడుతున్న యువకులు

వినాయకా.. సెలవిక..



బీఎన్‌కండ్రిగ నీర్పాకోట గ్రామంలో వినాయకుడి ఊరేగింపు

శ్రీకాళహస్తి: పట్టణంలో బుధవారం వినాయక నిమజ్జనోత్సవం వేడుకలు జరిగాయి. వినాయక చవితిని పురస్కరించుకుని ఆయా వీధుల్లో యువత, పెద్దలు వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. మూడో రోజు బుధవారం పట్టణంలో పలు చోట్ల వినాయక ప్రతిమలకు నిమజ్జనం నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వాహనాలపై అధిష్టింపజేశారు. మేళతాళాలు, బ్యాండు వాయిద్యాల నడుమ స్వామి వారి నిమజ్జన వేడుకలు పండుగలా సాగింది. పట్టణ శివారులో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. పట్టణంలోని పెండ్లి మండపం, భేరివారి మండపం వద్ద ఉన్న వినాయక ప్రతిమలను 9వరోజు హోమ పూజలు అనంతరం నిమజ్జనం చేయనున్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గణేష్ నిమజ్జనం ఘనంగా జరిగింది. బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని తూర్పుమిట్ట, వినాయకవీధి, ఈబీసీకాలనీ, కాటూరు, నీర్పాకోట, కారణి, నెలవాయి, పార్లపల్లి, ఆలత్తూరు, పీవీకండ్రిగ, పదవమైలు, గాజులపెళ్లూరు గ్రామాల్లో గణేష్ నిమజ్జనానికి భారీసంఖ్యలో యువత పాల్గొన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన భక్తిశ్రద్ధలతో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి, విగ్రహాలను పూలతో అలంకరించి, నైవేద్యం పెట్టారు. యువకులు ఉత్సాహంగా వసంతాలు పోసుకుని, ఉట్టి కొట్టారు. అనంతరం వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. బుచ్చినాయుడుకండ్రిగలోని ఈబీసీ కాలనీలో అన్నదానం చేశారు.



వరదయ్యపాళెంలో గణనాథున్ని నిమజ్జనానికి తరలిస్తున్న యువత

ఘనంగా వినాయక నిమజ్జనం

ఏర్పేడు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పలు గ్రామాల్లో నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో వినాయక స్వామి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. యువకులు, విద్యార్థులు, గ్రామస్తులు ఉట్టి కొట్టారు. గ్రామాల్లో పరుగు, సైకిల్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు వినాయక స్వామికి పూజలు చేశారు. అనంతరం చెరువులు, నీటిగుంతల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

గణనాథుని సేవలో ఎమ్మెల్సీ సిపాయి

రేణిగుంట: మండల కేంద్రంలోని బుగ్గవీధిలోని గణనాథుని ఎమ్మెల్సీ సభ్యులు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు స్థానికులు శాలువా కప్పి సన్మానించారు. రేణిగుంట జీఎం వీధిలో వెలసిన గణనాథుని వద్ద అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియస్‌రాజు పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. తారకరామానగర్ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. డప్పువాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ యువత నృత్యాలు చేస్తూ నిమజ్జనం గావించారు. లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన విగ్రహాలను కోలాటాలు, నృత్యాలతో సందడిగా నిమజ్జనానికి తీసుకెళ్లారు.






బీఎన్‌కండ్రిగ: ఈబీసీ కాలనీలో అన్నదానం, అన్నదానం చేస్తున్న తారకరామానగర్ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి, జీఎం వీధిలో అన్నదానం చేస్తున్న సర్పంచ్ నగేషం, రేణిగుంటలో గణనాథుని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ సభ్యుడు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

శరవేగంగా భూముల రీసర్వే



భూముల సర్వే కోసం రికార్డులను పరిశీలిస్తున్న సర్వేయర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు గ్రామ రెవెన్యూలో మంగళవారం భూముల రీసర్వే శరవేగంగా జరుగుతున్నట్లు తహసీల్దారు భార్గవి తెలిపారు. రీసర్వేతో భూసమస్యలు పరిష్కారం అవుతాయని, ఇందుకోసం భూములకు సంబంధించిన రికార్డులను పక్కాగా సిద్ధం చేసినట్లు చెప్పారు. భూవివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భూముల రీసర్వే రైతులకు ఓ వరమని, రైతులంతా భూముల రీసర్వేకు సహకరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 100 ఏళ్ల తరువాత గ్రామీణ, పట్టణ, ప్రాంతాల్లో వ్యవసాయ, గ్రామ కంఠం స్థిరాస్తుల సర్వే జరుగుతుందన్నారు. భూముల రీసర్వేలో అన్‌రిజిస్టర్, వంశపారంపర్యం భూములను గుర్తించి రికార్డులలో నమోదు చేసి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తామన్నారు. సాగులో ఉన్నవారి పేరిట పాసుపుస్తకాలు వస్తాయని, ఆన్‌లైన్‌లో వారి పేరు నమోదు అవుతుందన్నారు. కంచనపుత్తూరు గ్రామ రెవెన్యూలో 2200 ఎకరాల భూమి ఉందని, అందులో 400 ఎకరాల సర్వే పూర్తయిందన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ గురవయ్య, వీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, శ్రావణ్‌కుమార్, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

నూతన పీహెచ్‌సీలో తొలి ప్రసవం



తొలికాన్పు అయిన బిడ్డను చూపుతున్న సిబ్బంది

నాగలాపురం: మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇటీవల మంత్రి పెద్దిరెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఇటీవలే ప్రారంభించారు. అన్ని వసతులతో ఏర్పాటైన ఈ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రాజేష్ బుధవారం తొలి ప్రసవం చేశారు. మండలంలోని కొట్టకాడు గ్రామానికి చెందిన ప్రవీణ్ భార్య నాగలక్ష్మి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఎన్నో ఏళ్ల తరువాత ఇక్కడ కాన్పులు చేయడం ఇదే ప్రథమమని వైద్యసిబ్బంది, స్థానికులు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై శిక్షణ



మాట్లాడుతున్న మండల జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్

నాగలాపురం: మండల కేంద్రంలోని కడివేడు, బీరకుప్పం గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలాపురం మండల జేసీఎస్ కన్వీనర్ బి.మోహన్ మొదలియార్, నాగలాపురం ఎంపీడీఓ పీకేఎం బాబు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వలంటీర్లు ఇంటింటా సర్వే నిర్వహించి ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి వాటిని వెంటనే యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. అనంతరం వైద్యబృందంతో కలిసి వారికి కేటాయించిన తేదీల్లో వైద్యపరీక్షలు చేసి, అవసరమైన మందులను ఉచితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో నాగలాపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ సుధాచిన్నదొరై, ఎంపీపీ సింధూశ్యామ్, ఎంపీపీ జాయిస్ ధానవేల్, ఎంఎల్‌ఓ చంద్ర, సచివాలయ కన్వీనర్ కుప్పయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, సోషల్ మీడియా కోకన్వీనర్ రాంరాజ్, గృహసారథులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు ఎంపిక



వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



ఖోఖోకు ఎంపికైన విద్యార్థులు

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెం హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీలకు సంబంధించి నియోజకవర్గస్థాయి ఎంపికలు జరిగాయి. బుధవారం ఉదయం క్రీడా మైదానంలో జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, టెలికాం బోర్డు సభ్యులు సుందరరెడ్డి ఎంపికలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అండర్-14, 17 బాలురు, బాలికలకు సంబంధించి వాలీబాల్, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించి పోటీలు నిర్వహించారు. పోటీల్లో 400 పైగా విద్యార్థులు పాల్గొనడంతో వారిలో 136 మందిని ఎంపిక చేశారు.

ఎంపికైనవారు జిల్లాస్థాయి పోటీల్లో నియోజకవర్గం నుంచి క్రీడాపోటీల్లో పాల్గొననున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ బందిల కుమార్ తెలిపారు. వివిధ హైస్కూళ్ల నుంచి క్రీడాపోటీల నిర్వహణకు హాజరైన వ్యాయామ ఉపాధ్యాయులకు స్థానిక ఆర్‌ఆర్ కల్యాణ మండపం అధినేత సుందరరెడ్డి క్రీడా టీషర్టులను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణయ్య, యాదవ సంఘం నాయకుడు జానకిరాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణించండి

పుత్తూరు రూరల్: పుత్తూరు ఆర్టీసీ డిపో బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికులు లక్కీ డిప్ ద్వారా బహుమతులు గెలుచుకోవచ్చని డిపో మేనేజర్ ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ టికెట్ వెనుక భాగంలో తమ పేరు, సెల్ నంబర్‌ను రాసి పుత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్స్‌లో వేయాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీ, 30న గిఫ్ట్ బాక్స్ తెరుస్తామన్నారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం



గ్రామస్తులతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



నూతన సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ఏర్పడిందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మునలిపేడులో బుధవారం నూతన సచివాలయాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో రూ.40 లక్షలతో సచివాలయ భవనాన్ని నిర్మించినట్లు వివరించారు. పేదలు తమ సమస్యల పరిష్కారానికి మండల కేంద్రానికి వెళ్లకుండా గ్రామాల్లోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో తమ సమస్యలను విన్నవించుకోవడానికి మండల కేంద్రానికి వెళుతుండేదన్నారు. ప్రజలు కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరిగినా సమస్యల పరిష్కారం అయ్యేదికాదన్నారు. జగనన్న గ్రామాల్లోని సచివాలయ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసి అక్కడే సంబంధిత అధికారులను నియమించి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. పేదల కోసం సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి వాటిని సక్రమంగా అమలు చేస్తున్నారని వెల్లడించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీ తిరుమలయ్య, వైస్ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, పార్టీ మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, వెంకటేష్, శేఖర్‌రెడ్డి, అయోధ్య, జయచంద్ర, మస్తాన్ పాల్గొన్నారు.

మీ సాయం.. మేము మరువం సార్




అభివృద్ధి చేసిన సాధనవారిపాళెం రోడ్డు, గుంతలమయమైన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)



సాధనవారిపాళెంలో నూతనంగా వేస్తున్న బోరు

వరదయ్యపాళెం: 'మా ఊరి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే ఆదిమూలంకు కృతజ్ఞతలు.. ఇంతసాయం ఆయనకు మేము రుణపడి ఉన్నాం.. వచ్చే ఎన్నికల్లో కూడా ఆయనకు తోడుంటాం' అని సాధనవారిపాళెం గ్రామస్తులు ముక్తకంఠంతో తెలిపారు. మండలంలోని సాధనవారిపాళెంలో గత కొంతకాలంగా రోడ్డు, తాగునీటి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ఈ నెల 6వ తేదీన ఎమ్మెల్యే ఆదిమూలం పర్యటించారు. ఈ సమయంలో స్థానిక ప్రజలు గుంతలమయమైన రోడ్డును అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. అలాగే తాగునీటి ఇబ్బందులను వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆదిమూలం తక్షణమే నూతన బోరు ఏర్పాటు చేయాలని, గుంతలమయమైన రోడ్డును చదును చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గత రెండు రోజులుగా అధ్వానంగా ఉన్న రోడ్డును చదును చేసి గ్రావెల్ మట్టిని నింపి రోలర్‌తో రోలింగ్ చేసి రాకపోకలకు అనువుగా పునరుద్ధరించారు. అలాగే తాగునీటి కోసం నూతన బోరును ఏర్పాటు చేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



కార్యక్రమంలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది

జగనన్నకు చెబుదాం..



శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జరిగిన జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రజల నుంచి స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అర్జీలు స్వీకరించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. దీర్ఘకాలిక సమస్యలు సైతం పరిష్కరించుకునేందుకు ఇది చక్కటి వేదిక అని వక్తలు కొనియాడారు. - శ్రీకాళహస్తి